RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 209 | సెప్టెంబర్ 02 బుధవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 209 | August 02 Wednes day2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


ఎయిర్‌పోర్టు స్థల పరిశీలన

2

# పింఛన్లతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**

**భీమవరం జనసంఘర్షణ**

పింఛన్ల ద్వారా పేద కుటుంబాల్లో ఆర్థిక భరోసా నింపి, సమాజంలో వృద్ధులు మరియు నిరాశ్రయులకు ప్రాధాన్యతతో కూడిన గౌరవాన్ని కల్పించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరులో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో పింఛన్ల నిమిత్తం ఇప్పటివరకు రూ.75,503 కోట్లు వెచ్చించామని, ఆ మొత్తంతో ఏకంగా మూడు పోలవరం ప్రాజెక్టులను నిర్మించవచ్చని పేర్కొన్నారు. పేదరిక నిర్మూలన, సామాజిక సమానత్వమే ధ్యేయంగా తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. మహిళా సాధికారతే లక్ష్యంగా డ్వాక్రా సంఘాలు, దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేపడుతున్నామని సీఎం చెప్పారు. త్వరలోనే మహిళల కోసం ప్రత్యేక ఉచిత ఏసీ బస్సులు, ఆర్టీసీలో మహిళా డ్రైవర్ వ్యవస్థను కూడా అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. అలాగే గృహ విద్యుత్ వినియోగదారుల కోసం సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని, ప్రతి ఇంట్లో ఒక చిన్న పారిశ్రామికవేత్తను తయారుచేసేలా 'వన్ హౌస్ - వన్ ఆంత్రప్రెన్యూర్' విధానాన్ని అమలులోకి తెచ్చామని వివరించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 5.90 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, మరో 5 లక్షల ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, వినాయక చవితి నాటికి గోదావరి నీటిని ఉత్తరాంధ్రకు తరలించి సరికొత్త చరిత్ర సృష్టించబోతున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్



కాంగ్రెస్ పార్టీ వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన సీఎం, ఆ పార్టీ అభివృద్ధిని అడ్డుకునే విధంగా ప్రవర్తిస్తోందని విమర్శించారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను నిలిపివేసేందుకు 350కి పైగా పిటిషన్లు వేశారని, బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుంటే కోర్టులను ఆశ్రయించి అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. గడిచిన మూడేళ్లలో తాము రూపాయి కూడా కరెంట్ ఛార్జీలు పెంచలేదని, గత ప్రభుత్వం రూ.32 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేసిందని గుర్తుచేశారు. ఎంతమంది అడ్డంకులు సృష్టించినా రాష్ట్ర ప్రగతిని, సంక్షేమాన్ని ఆపేది లేదని, రాబోయే జనవరి నుంచి 'సంజీవని' పథకం ద్వారా వైద్యాన్ని ప్రజల ముంగిట్లోకి తెస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌కు మరో 5 ఎస్-400

## రష్యాతో ఒప్పందానికి సన్నాహాలు



**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**

గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకునే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. ఆపరేషన్ సింధూర్ సమయంతో పాటు ఇటీవల శత్రుదేశాల నుంచి ఎదురైన ముప్పులను సమర్థవంతంగా అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించిన రష్యన్ తయారీ 'ఎస్-400 ట్రయంఫ్' క్షిపణి వ్యవస్థలను మరిన్ని కొనుగోలు చేసేందుకు భారత రక్షణ శాఖ మొగ్గు చూపుతోంది. భారత వైమానిక దళ అవసరాల నిమిత్తం మరో ఐదు ఎస్-400 వ్యవస్థల కొనుగోలుకు సంబంధించి జారీ చేసిన టెండర్‌కు రష్యా సానుకూలంగా స్పందించింది. భారత్‌కు ఈ ఐదు కొత్త వ్యవస్థలను విక్రయించడానికి సిద్ధంగా ఉన్నట్లు రష్యా రక్షణ వర్గాలు ధ్రువీకరించాయి. భారత సైనిక దళాల్లో 'సుదర్శన్' అని పిలుచుకునే ఈ ఎస్-400 క్షిపణి వ్యవస్థ గతంలో ఎన్నో సార్లు తన సత్తా చాటుకుంది. పశ్చిమ వైమానిక కమాండ్ అధిపతి ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా ఒక టాక్ షోలో వెల్లడించిన వివరాల ప్రకారం.. పాకిస్థాన్ వైమానిక దళానికి

# నేషనల్ పెన్షన్ సిస్టమ్‌లో కీలక మార్పులు

**అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి**

**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**

నేషనల్ పెన్షన్ సిస్టమ్ చందాదారులకు సంస్కరించబడిన కొత్త నిబంధనలను పెన్షన్ ఫండ్ నియంత్రణ, అభివృద్ధి సంస్థ ప్రకటించింది. ఆగస్టు 28న జారీ చేసిన సర్క్యులర్ ద్వారా ఈ మార్పులను వెల్లడించింది. ఇవి 2026 అక్టోబర్ 1 నుంచి అధికారికంగా అమల్లోకి రానున్నాయి. పెట్టుబడిదారులకు స్పష్టతనివ్వడం, తమ రిస్క్ ప్రొఫైల్‌కు తగిన పథకాలను ఎంచుకోవడాన్ని సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ కొత్త విధివిధానాలను రూపొందించారు.

కొత్త నిబంధనల ప్రకారం, ఎన్‌పీఎస్ పథకాలను ఈక్విటీ పెట్టుబడుల శాతం ఆధారంగా ఐదు వేర్వేరు కేటగిరీలుగా వర్గీకరిస్తారు:

కేటగిరీ (అగ్రెసివ్ గ్రోత్): 80 నుంచి 100 శాతం ఈక్విటీ కేటాయింపులు ఉన్న పథకాలు. ఇవి అత్యంత అధిక రిస్క్‌తో కూడుకున్నవి.

కేటగిరీ-దీ (హై గ్రోత్): 60 నుంచి 80 శాతం ఈక్విటీ ఉన్న పథకాలు. ఇవి అధిక రిస్క్ వర్గంలోకి వస్తాయి. కేటగిరీ-జ (బ్యాలెన్స్‌డ్ గ్రోత్): 35 నుంచి 60 శాతం ఈక్విటీ కేటాయింపులు ఉన్న పథకాలు. ఇవి మధ్యస్థ రిస్క్ కలిగినవి.

కేటగిరీ-ఙ (కన్జర్వేటివ్): 10 నుంచి 35 శాతం ఈక్విటీ ఉన్న పథకాలు.

కేటగిరీ-జు (డెట్ ఆధారిత): 0 నుంచి 10 శాతం మాత్రమే ఈక్విటీ ఉండే పథకాలు. ఇవి డెట్ సాధనాలలో ఎక్కువ పెట్టుబడి పెడతాయి.

ఈ కొత్త వర్గీకరణ ద్వారా ఏ ఒక్క పథకం కూడా ఒకేసారి రెండు కేటగిరీల పరిమితుల్లోకి రాకుండా స్పష్టమైన సరిహద్దులు నిర్దేశించారు.

దీంతో పాటు, అక్టోబర్ 1 నుంచి 'పాయింట్ ఆఫ్ ప్రెజెన్స్' (ఫ్రాశీ) ద్వారా కొత్తగా ఎన్‌పీఎస్ ఖాతా తెరిచే చందాదారులకు ప్రతి ప్రాన్ (ఫ్రా=ూచీ) పై రూ. 200ల వన్-టైమ్ ఛార్జీని వసూలు చేయనున్నారు. ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా, ప్రతి త్రైమాసికానికి రూ. 50 చొప్పున యూనిట్లను రద్దు చేయడం ద్వారా క్రమంగా రాబడతారు.

అలాగే పెట్టుబడిదారులు ఏ పథకాన్ని ఎంచుకోవాలన్నా పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా ్రాఖీ=ణూ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇకపై పథకం పేరు, పెన్షన్ ఫండ్ వివరాలు, ప్రారంభ తేదీ,

➤ మిగతా 2వ పేజీలో..

# భారత్ జీడీపీ వృద్ధి రేటు 7.8 శాతం

**స్వదేశీ పిలుపునిచ్చిన ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**



ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, సరఫరా వ్యవస్థలలో ఆటంకాలు మరియు ఆర్థిక సంక్షోభాలు నెలకొన్నప్పటికీ, భారత్ 7.8 శాతంతో మెరుగైన జీడీపీ వృద్ధి రేటును సాధించడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో నమోదైన ఈ అసాధారణ ప్రగతి దేశ ప్రజల సమష్టి శక్తికి, పట్టుదలకు నిదర్శనమని ఆయన కొనియాడారు. ప్రస్తుతం కిర్గిజిస్తాన్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ, ఇన్స్టాగ్రామ్ వేదికగా ఒక వీడియోను విడుదల చేస్తూ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం కంటే ఇది అధికమని, ప్రతికూల పరిస్థితుల్లోనూ భారత ఆర్థిక వ్యవస్థ బలంగా నిలబడటం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు మరోసారి 'ఆత్మనిర్భరత' మరియు 'స్వదేశీ' మంత్రాన్ని గుర్తుచేశారు. విదేశీ మారక నిల్వలను ఆదా చేసేందుకు మరియు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రజలంతా స్వదేశీ వస్తువులకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనవసరంగా విదేశీ పర్యటనలు చేయడం, విదేశాల్లో 'డెస్టినేషన్ వెడ్డింగ్స్' నిర్వహించడం వంటి వాటికి దూరంగా ఉండాలని, వివాహాది శుభకార్యాలను భారత్‌లోనే జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అవసరం లేకపోతే బంగారం కొనుగోలు చేయడం తగ్గించాలని, స్థానికంగా తయారైన ఉత్పత్తులు మరియు సేవలను ఎక్కువగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

దేశం స్వాతంత్ర్యం పొంది 100 ఏళ్లు పూర్తి చేసుకునే నాటికి 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్)గా మారాలనే లక్ష్య సాధనలో 140 కోట్ల మంది ప్రజల ఐక్యత, కృషి కీలకపాత్ర పోషిస్తాయని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు. నిరాశావాదులు చేసే అసత్య ప్రచారాలను పక్కన పెట్టి, దేశ ప్రగతిని పండుగలా జరుపుకోవాలని ఆయన ప్రజ కోరారు.

# మరోసారి తెరపైకి సింధూ జలాల వివాదం

**ఎస్సీఓ సదస్సులో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**

భారత్-పాకిస్తాన్ మధ్య దీర్ఘకాలంగా నెలకొన్న సింధూ నదీ జలాల వివాదం అంతర్జాతీయ వేదికపై మరోసారి చర్చనీయాంశమైంది. ది హేగ్‌లోని శాశ్వత మధ్యవర్తిత్వ న్యాయస్థానం (కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్) ఇచ్చిన తీర్పును భారత్ తిరస్కరించిన నేపథ్యంలో, షాంఘై సహకార సంస్థ సదస్సులో పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. షాంఘై సహకార సంస్థ కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ స్టేట్ భేటీలో మాట్లాడిన ఆయన,

➤ మిగతా 2వ పేజీలో..

# మరోసారి తెరపైకి సింధూ జలాల వివాదం

**మొదటిపేజీ తరువాయి..** జల వనరులను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదని వ్యాఖ్యానించారు. నీరు అనేది లక్షలాది మంది ప్రజల జీవితాలకు, వ్యవసాయానికి ఆధారం అని, భవిష్యత్ తరాల అవసరాలను తీర్చే అత్యంత కీలకమైన వనరు అని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. ఉమ్మడి జల వనరులను ఆయుధంగా మార్చుకోవడానికి అనుమతించకూడదని, ఇతర దేశాలపై ఒత్తిడి తీసుకురావడానికి లేదా రాజకీయ ప్రయోజనాలు పొందడానికి నీటిని వాడుకోవడం సరికాదని ఆయన అన్నారు.

అయితే, పాక్ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయడానికి కాసేపటి ముందే భారత ప్రధాని నరేంద్ర మోదీ ఎస్సీఓ వేదికగా ప్రసంగించారు. సరిహద్దు ఉగ్రవాదంపై భారత్ వైఖరిని ప్రధాని మోదీ స్పష్టంగా వివరించారు. ఉగ్రవాదంపై పోరాటంలో ద్వంద్వ ప్రమాణాలు సరికావని, ఉగ్రవాదులకు నిధులందించడం, నియామకాలు చేపట్టడం మరియు ఉగ్ర స్థావరాలను నిర్వహించడం వంటి సమగ్ర వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. ఉగ్రవాదాన్ని రాజ్య విధానంగా (స్టేట్ పాలసీ) ఉపయోగించే దేశాలకు గట్టి సందేశం ఇవ్వాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

## 'తల్లికి వందనం' నిధుల విడుదలకు సిద్ధం

**సుమారు 2.80 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి**

**ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయం**

**మొదటి సంవత్సరం విద్యార్థులకు అందజేత**

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో 'తల్లికి వందనం' పథకం కింద డబ్బులు పడకుండా ఎదురుచూస్తున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. మరో మూడు రోజుల్లో అర్హులైన మిగిలిన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఈ నిధులను జమ చేయనున్నట్లు వెల్లడించింది. ముఖ్యంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఈ పథకం కింద ఆర్థిక సహాయం అందనుంది. వాస్తవానికి ఈ నిధులను ఆగస్టు 30వ తేదీనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా, కొన్ని సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది. ఈ నేపథ్యంలో అధికారులు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పునఃసమీక్షించారు. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల నుంచి అర్హులైన లబ్ధిదారుల జాబితాలను స్వీకరిస్తున్నారు. ఈ జాబితాల పరిశీలన పూర్తయిన వెంటనే ఆర్థిక శాఖ నేరుగా ఖాతాల్లోకి నగదును జమ చేయనుంది. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.80 లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు. గతంలో అర్హత ఉండి కూడా వివిధ కారణాలతో నిధులు అందని వారికి సైతం ఈ దఫాలోనే నగదు జమ చేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనపై సానుకూలత

## 7న కేంద్ర సాంకేతిక బృందం పర్యటన

**నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన**

**సాంకేతిక నివేదిక అనంతరం తదుపరి చర్యలు**

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రామ్మోహన్ నాయుడి హామీ**

**న్యూఢిల్లీ :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనకు సంబంధించి నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించేందుకు కేంద్ర సాంకేతిక బృందం సెప్టెంబర్ 7న తెలంగాణలో పర్యటించనుంది. న్యూఢిల్లీలో మంగళవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో సమావేశమైన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. గతంలో పరిశీలించిన రెండు స్థలాలు సాంకేతిక కారణాలతో విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేవని తేలడంతో, తాజాగా నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ఈ స్థలాల్లోని భౌగోళిక, వాతావరణ పరిస్థితులతోపాటు విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక సాధ్యాసాధ్యాలను కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుందని చెప్పారు. ౹÷శింద్ర సాంకేతిక బృందం నివేదిక అనుకూలంగా వచ్చిన అనంతరం కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపడుతుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చినట్లు మంత్రి తుమ్మల తెలిపారు.

తెలంగాణలోని మామునూరు (వరంగల్), ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 2న కేంద్ర ప్రభుత్వంతో చర్చించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తండ్రి, దివంగత ఎర్రన్నాయుడు తన చిరకాల మిత్రుడని మంత్రి తుమ్మల గుర్తుచేసుకున్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఉన్న ఈ ప్రాంత ప్రాధాన్యాన్ని, జిల్లా ప్రజలకు విమానాశ్రయం అవసరాన్ని కేంద్ర మంత్రికి వివరించినట్లు తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దీర్ఘకాల ఆకాంక్షను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాను. నా విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి, వెంటనే కేంద్ర సాంకేతిక బృందాన్ని పంపేందుకు చర్యలు చేపట్టిన కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడికి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# నేషనల్ పెన్షన్ సిస్టమ్‌లో కీలక మార్పులు

**మొదటిపేజీ తరువాయి..** రాబడులు, బెంచ్‌మార్క్, ఛార్జీలు, రిస్క్ మీటర్ మరియు నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తుల వివరాలన్నీ ఒకే ప్రామాణిక పద్ధతిలో స్పష్టంగా కనిపిస్తాయి. అయితే ఈ కొత్త వర్గీకరణ నిబంధనలు ప్రభుత్వ రంగానికి చెందిన ఎన్‌పీఎస్ ఖాతాదారులకు వర్తించవని పిఎఫ్ఆర్‌డిఎ స్పష్టం చేసింది.

## ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

**మహిళలకు చంద్రబాబు గుడ్ న్యూస్**

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీపి కబురు అందించారు. రాష్ట్రంలో త్వరలో పెద్ద ఎత్తున అందుబాటులోకి రానున్న ఏసీ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. మొగల్తూరులో నిర్వహించిన 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని పేర్కొన్నారు. సంక్షేమంతో కూడిన అభివృద్ధే తమ ప్రభుత్వ విధానమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు పింఛన్ల రూపంలోనే ప్రజలకు రూ. 73,000 కోట్లు అందించినట్లు గుర్తుచేశారు. మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వారి కష్టాలను తీర్చేందుకే 'దీపం' పథకాన్ని తీసుకువచ్చామని వివరించారు. ఇదే సమయంలో గత వైసీపీ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మెగా డీఎస్సీని అడ్డుకోవాలనే లక్ష్యంతో ఏకంగా 350 కేసులు వేశారని ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్రంలో అభివృద్ధిని ఆపలేరని హితవు పలికారు. కేవలం ప్రజల ప్రయోజనాల కోసమే కూటమి పార్టీలు ఏకమయ్యాయని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రభుత్వం బాధ్యతాయుతంగా ముందుకు సాగుతోందని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

## కాంగ్రెస్ అరాచకానికి పాల్పడుతుంది

**అందుకు రాంచందర్ రావు అరెస్ట్ నిదర్శనం**

**కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారు**

**బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్**

**న్యూఢిలీ :** తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు అరెస్టు చేయడాన్ని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్రస్థాయిలో తప్పుబట్టారు. ఈ అణచివేత చర్య కాంగ్రెస్ ప్రభుత్వ దివాలాకోరుతనానికి, నియంతృత్వ వైఖరికి అద్దం పడుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ కార్యకర్తల దాడికి గురైన నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళు తున్న రాంచందర్ రావును పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం అత్యంత హేయమని నితిన్ నబీన్ అన్నారు. కాంగ్రెస్ శ్రేణులు భౌతిక దాడులు, అరాచకాలకు పాల్పడుతున్నప్పుడు ప్రేక్షక పాత్ర వహించిన పోలీసు యంత్రాంగం... బాధితులకు అండగా నిలిచేందుకు వెళుతున్న ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడం ఏ రకమైన ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చెప్పే మాటలన్నీ కేవలం ప్రజలను మభ్యపెట్టే నాటకాలని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న ఈ దౌర్జన్యాలు, ప్రతిపక్షాలపై దాడులకు తెలంగాణ ప్రజలు రాబోయే రోజుల్లో తగిన రీతిలో బుద్ధి చెబుతారని నితిన్ నబీన్ హెచ్చరించారు. రాంచందర్ రావు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ఎల్‌నినో ప్రభావంతో కరువు ఛాయలు

**మంచినీటికి కటకట తప్పదేమో: ఆనం**

**నెల్లూరు :** ఎల్‌నినో ప్రభావంపై ఏపీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందని తెలిపారు. గోదావరి, కృష్ణా, పెన్నా నదుల్లో నీటి ప్రవాహాలు లేక జలాశయాలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. ఈరోజు (మంగళవారం) నెల్లూరు జిల్లాలో మంత్రి ఆనం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాబోయే 6 నెలల్లో పంటలకే కాదని, తాగడానికి కూడా నీళ్లు దొరకడం కష్టమేనని మంత్రి ఆనం వ్యాఖ్యానించారు. భూగర్భ జలాలు ఇప్పటికే 3 మీటర్లు పడిపోయాయని.. మరింత తగ్గే అవకాశం ఉందని వెల్లడించారు. చేతికి వచ్చిన ధాన్యాన్ని డబ్బుల కోసం వెంటనే మార్కెట్లో అమ్మేసుకోవద్దని అన్నదాతలకు సూచించారు. వచ్చే జూన్, జులై వరకు సరిపడేలా ప్రతి ఒక్కరూ ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని మార్గనిర్దేశర చేశారు. నీరు, ఆహార ధాన్యాల పొదుపుపై ప్రజలు, రైతన్నలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచించారు.

# భారత్‌కు మరో 5 ఎస్-400

**మొదటిపేజీ తరువాయి..** చెందిన నిఘా విమానాన్ని ఏకంగా 314 కిలోమీటర్ల సుదూర ప్రాంతం నుంచి ఎస్-400 విజయవంతంగా కూల్చివేసింది. భూమి మీద నుంచి ప్రయోగించే గగనతల రక్షణ క్షిపణి వ్యవస్థ ద్వారా ఇంత సుదూరంలో ఉన్న లక్ష్యాన్ని ఛేదించడం రక్షణ రంగంలో అత్యంత అరుదైన మైలురాయిగా నిలిచింది.

ఎస్-400 అనేది కేవలం ఒక సాధారణ మిస్సైల్ మాత్రమే కాదు. ఇందులో అత్యంత ఆధునికమైన రడార్లు, అధునాతన కమాండ్ సెంటర్లు, విభిన్న రకాల క్షిపణులు ఉంటాయి. వీటిలోని కొన్ని క్షిపణులు గరిష్టంగా 400 కిలోమీటర్ల పరిధిలోని శత్రు విమానాలు, డ్రోన్లు, క్షిపణులను సరిహద్దులు దాటకముందే గుర్తించి ధ్వంసం చేయగలవు. ఈ అసమానమైన సాంకేతిక సామర్థ్యం కారణంగానే భారత్ తన బహుళ-స్థాయి గగనతల రక్షణ వ్యూహంలో ఎస్-400కు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది.

కాగా, 2018లో రష్యాతో కుదుర్చుకున్న తొలి ఒప్పందం ప్రకారం భారత్ మొత్తం ఐదు ఎస్-400 యూనిట్లను కొనుగోలు చేయాల్సి ఉంది. అందులో ఇప్పటివరకు నాలుగు యూనిట్లు భారత సైన్యానికి అందగా, ఐదో యూనిట్ ఈ ఏడాది నవంబర్ నాటికి భారత్‌కు చేరుకునే అవకాశాలు ఉన్నాయి. సరిహద్దుల్లో భద్రతా సవాళ్లు పెరుగుతున్న నేపథ్యంలో, ఆ రక్షణ కవచాన్ని మరింత విస్తరించేందుకు భారత్ కొత్తగా మరో ఐదు ఎస్-400 యూనిట్లను సేకరించే దిశగా రష్యాతో త్వరలోనే తుది ఒప్పందం కుదుర్చుకోనుంది.

## హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి..

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదం కేసులో ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్, టీటీడీ బోర్డు సభ్యుడు ఆనంద్ సాయి కుమారుడు సందీప్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో బీహార్‌కు చెందిన నందులాల్ అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) రోటరీ నుంచి ఖాజాగూడ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. రోడ్డు దాటుతున్న నందులాల్‌ను సందీప్ తన కారుతో అతివేగంగా ఢీకొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన జైద్ షా ఖాద్రీ అనే విద్యార్థి, క్షతగాత్రుడైన నందులాల్‌ను తన కారులో ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో మహీంద్రా కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ రెండో ప్రమాదంలో మరింత తీవ్రంగా గాయపడిన నందులాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన మహీంద్రా కారు ఆపకుండా అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న రాయదుర్గం పోలీసులు, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక నిపుణుల సహాయంతో ప్రమాదానికి కారణమైన రెండు వాహనాలను గుర్తించారు. అనంతరం రెండు కార్లను స్వాధీనం చేసుకుని, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయిని విచారించిన తర్వాత ఆయన కుమారుడు సందీప్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. పోలీసులు వెల్లడించిన తెలిపిన వివరాల ప్రకారం.. రాయదుర్గం పరిధిలోని ప్రధాన రహదారిపై నందులాల్ అనే వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా వేగంగా వచ్చిన ఇన్నోవా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నందులాల్ తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డుపై తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడి ఉన్న నందులాల్‌ను గమనించిన జైద్ షా ఖాద్రీ అనే విద్యార్థి వెంటనే స్పందించి.. అతడిని ఆసుపత్రికి తరలించేందుకు తన వాహనంలో ఎక్కించుకున్నాడు.అయితే నందులాల్‌ను ఆస్పత్రికి తరలించే క్రమంలో మరో అనూహ్య ప్రమాదం చోటుచేసుకుంది. వెనుక నుంచి వేగంగా వచ్చిన మహీంద్రా కారు.. వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో గాయపడిన నందులాల్ దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటనలో జైద్ షా ఖాద్రీకి కూడా తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదం తర్వాత మహీంద్రా కారు అక్కడ ఆగకుండా వెళ్లిపోయినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో స్థానికులు అక్కడికి చేరుకుని.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న రాయదుర్గం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించడంతో పాటు సాంకేతిక ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో పాల్గొన్న వాహనాలను గుర్తించే దిశగా పోలీసులు చర్యలు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నందులాల్‌ను ఢీకొట్టిన ఇన్నోవా కారును గుర్తించిన పోలీసులు.. ఆ వాహనం సందీప్‌కు సంబంధించినదిగా నిర్ధారించారు. అనంతరం ప్రమాదానికి సంబంధించి సందీప్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఇన్నోవా కారును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

## రాంచంద్రరావు హౌజ్ అరెస్ట్

**హైదరాబాద్ :** భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తార్నాకలోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. భాజపా నల్గొండ జిల్లా అధ్యక్షుడి నివాసానికి వెళ్లనున్నట్టు ప్రకటించడంతో ఆయన్ను గృహనిర్బంధం చేసినట్టు పోలీసులు తెలిపారు. నల్గొండ జిల్లాలో భాజపా, కాంగ్రెస్ శ్రేణుల మధ్య పరస్పరం దాడులు జరిగాయి. నల్గొండలో మంత్రి కోమటి రెడ్డి కార్యాలయంపై భాజపా కార్యకర్తలు కోడిగుడ్ల దాడి చేయగా.. భాజపా నల్గొండ జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి

నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేశారు. దీంతో పట్టణంలో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ క్రమంలో నల్లగొండ

వెళ్లేందుకు రామచంద్రరావు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటనపై బిజెపి శ్రేణులు మండిపడ్డాయి. అలాగే కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కేసీఆర్‌పై వ్యక్తిగత విమర్శలు మానండి. హామీల అమలుపై దృష్టి పెట్టండి

- **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి ధ్వజం.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ)
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మైకు దొరికిన ప్రతిసారీ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి హితవు పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నా. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు ఎంతవరకు జరిగిందో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు."నంది ఎవరో.. పంది ఎవరో మీ వెయ్యి రోజుల పాలనే తేటతెల్లం చేస్తోంది" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌పై వ్యక్తిగత దూషణలకు దిగడం ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తికి తగదన్నారు.తెలంగాణ ఉద్యమానికి రథసారథిగా నిలిచి ప్రాణాలను పణంగా పెట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన నాయకులు కేసీఆర్ అని పేర్కొన్నారు.పదేళ్ల పాలనలో సాగునీరు,ఉచిత విద్యుత్, రైతుబంధు వంటి పథకాలతో తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపారని గుర్తుచేశారు. వెయ్యి జన్మలెత్తినా కేసీఆర్ చేసిన పనులను చేయడం సాధ్యం కాదని అన్నారు. తెలంగాణ చరిత్ర నుంచి కేసీఆర్ పేరును చెరిపివేయడం ఎవరి తరమూ కాదన్నారు.హామీల అమలు ఏదీ?కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పూర్తిస్థాయి రుణమాఫీ, రైతుబంధు, మహిళల సంక్షేమం, నిరుద్యోగ భృతి తదితర హామీల పరిస్థితి ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.ప్రజలు ప్రచార ఆర్భాటాలను కాకుండా తమ జీవితాల్లో మార్పు తీసుకొచ్చే పనితీరును కోరుకుంటున్నారని అన్నారు.పేదల ఇళ్ల కూల్చివేతే అభివృద్ధా?హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చడం, మూసీ ప్రాజెక్టు పేరుతో భూ సమస్యలు సృష్టించడం అభివృద్ధి కాదని విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. సూర్యుడిపై ఉమ్మివేస్తే అది తిరిగి మీముఖంపైనే పడుతుందని, కేసీఆర్‌పై చేస్తున్న విమర్శలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికే ఎదురుదెబ్బగా మారతాయని అన్నారు. కేసీఆర్‌పై



చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు అక్రమ అరెస్టు పిరికిపంద చర్య

- **బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు మండిపడ్డారు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ)
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఓవరాక్షన్ చేయడం,అక్రమ అరెస్టులకు పాల్పడటం తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు గారిని అడుగడుగునా అడ్డుకోవడం,ఎక్కడికి వెళ్లినా అరెస్టులు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికితనానికి నిదర్శనమన్నారు.రెండు రోజుల క్రితం అరెస్టు చేసినా మళ్లీ మంగళవారం హౌస్ అరెస్టు చేయడం ఏ రకమైన ప్రజాపాలన అని ప్రశ్నించారు. అంతేకాకుండా నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుల ఇంటిపై దాడి చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. రాజకీయాలను రాజకీయంగానే ఎదుర్కోవాలని,దమ్ము, ధైర్యం ఉంటే ప్రజాక్షేత్రంలో బీజేపీని ఎదుర్కోవాలని సూచించారు. నాయకుల ఇళ్లపై దాడులు చేయడం చేతగాని,పిరికిపంద చర్య అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తలు చేతులు ముడుచుకుని కూర్చునే పార్టీ కాదని రాగి రాములు హెచ్చరించారు.అయితే బీజేపీకి ఒక క్రమశిక్షణ, ఒక పద్ధతి, ఒక సిద్ధాంతం,ఒక నీతి ఉన్నాయని స్పష్టం చేశారు. కార్యకర్తలకు పార్టీ క్రమశిక్షణ నేర్పిందని, అందుకే ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేస్తున్నామని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అరెస్టులు,దాడులు,రాజకీయ కక్ష సాధింపులకే ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. గ్రామాల్లోకి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో తెలుస్తుందన్నారు. ప్రభుత్వ శాఖల్లో అవినీతి, కమిషన్ల ఆరోపణలు వినిపిస్తున్నాయని, ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వం అవినీతి ఆరోపణలకు కేంద్రంగా మారిందని రాగి రాములు ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్,విద్యార్థుల సమస్యలు, పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలు వంటి కీలక అంశాలపై ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. విద్యార్థులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు.పోలీసులు కూడా ప్రభుత్వం చెప్పిన



ప్రతి పనిని చేయకుండా చట్టం, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలని బీజేపీ తరఫున కోరుతున్నామని తెలిపారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు గారిని వెంటనే విడుదల చేయాలని,ఆయనను అక్రమంగా నిర్బంధించినందుకు ప్రభుత్వం బహిరంగంగా క్షమాపణ చెప్పాలని రాగి రాములు డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, అక్రమ అరెస్టులు ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్య పద్ధతిలో రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కక్ష సాధింపు రాజకీయాలను విడనాడి ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని రాగి రాములు హితవు పలికారు.

## తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు

- **తెలంగాణ ఉద్యమకారులు పోలీస్ దేవేందర్, వగ్గు కుమార్ సాగర్ లు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాల విషం చేశారు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ)
తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, వారి సంక్షేమం కోసం 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్,బస్సు సౌకర్యం కల్పిస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలియజేస్తూ మంగళవారం ఆయన చిత్రపటానికి పాలాభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి,ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావుకి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావుకి తెలంగాణ ఉద్యమకారుల తరఫున హృదయపూర్వక



ధన్యవాదాలు,కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఈ పాలాభిషేక కార్యక్రమంలో కుమార్ సాగర్,పోలీస్ దేవేందర్,భాను ప్రసాద్, అన్నులా రాజు,తుడుమ్ నవీన్,మల్లుపల్లి శశీధర్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ భవనం కమిటీ హాల్ వద్ద మండల ఉపసర్పంచుల పురం అధ్యక్షుడు చేగుంట ఉపసర్పంచ్ మహ్మద్ రఫీ సొంత నిధులతో బోరు వేయించడం జరిగింది

- **ఆయనను ఇబ్రహీంపూర్ ముదిరాజ్ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ)





మెదక్ జిల్లా చేగుంట మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో ముదిరాజ్ భవనం కమిటీ హాల్ ఆవరణలో మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు,చేగుంట ఉప సర్పంచ్, పేదల పెన్నిధి మహమ్మద్ రఫీ సొంత నిధులతో బోరు వేయించడంతో పాటు మోటర్ ను దింపించారు. మంగళవారం రోజు బోరు మోటర్ ను ప్రారంభించిన అనంతరం మహమ్మద్ రఫీ మాట్లాడుతూ..వివిధ గ్రామాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు సొంత నిధులతో అనేక అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇబ్రహీంపూర్ గ్రామం ముదిరాజ్ సంఘం సభ్యులు కోరిక మేరకు వారికి బోరు మోటర్ వేయించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బేగంపేట జగదీశ్వర్ ఉప సర్పంచ్ చౌదరి శ్రీనివాస్ సంఘ సభ్యులు మాజీ సర్పంచ్ నాగభూషణం, కత్తుల రాజు, మల్లేశం, రాములు గడ్డ చంద్రం, గడీల రాజు ,అక్కల మహేష్ ,మల్లేశం నీల నర్సింలు, వార్డు సభ్యులు,భిక్ష పతి వంశీ ,కుల బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## ఊకే శిరీష హత్య తీవ్రంగా కలచివేసింది

- **రేగా కాంతారావు బి ఆర్ ఎస్ అధ్యక్షులు, పినపాక మాజీ శాసనసభ్యులు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, సెప్టెంబర్ 01(జనసంఘర్షణ):
గురుకులంలో చదివి, హైద్రాబాద్ లో నర్సుగా సేవలు అందిస్తూ, కుటుంబాన్ని పోషిస్తున్న ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసి ఆడబిడ్డ ఊకే శిరీషను హత్య చేయడం తీవ్రంగా కలిచివేసింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అసలు ఆడబిడ్డలకు కనీసం బతికే స్వేచ్ఛ అయినా ఉన్నదా.? ఇంకా ఎంతమంది ఆడబిడ్డలను ఇలా పొట్టనబెట్టుకుంటారు. ఒక ముఖ్యమంత్రిగా అలాగే హోంశాఖ మంత్రిగా పూర్తిగా విఫలమైన రేవంత్ రెడ్డి తక్షణమే ఆయన పదవులకు రాజీనామా చేయాలని ఈ సందర్భంగా నేను డిమాండ్ చేస్తున్నాను. తక్షణమే శిరీష మృతి పై విచారణ జరిపించి నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాను.వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియపరుస్తున్నాను.అని రేగా కాంతారావు జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు పినపాక మాజీ శాసనసభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పత్రిక ద్వారా తెలియజెశారు.



## పార్లమెంట్ ప్రతిపక్ష నేత శ్రీ రాహుల్ గాంధీ గారిపై ఎఫ్ఐఆర్ బీజేపీ కక్షసాధింపు రాజకీయాలకు నిదర్శనం...

- **ప్రశ్నించే గొంతును అణచలేరు...రాజ్యాంగం,సామాజిక న్యాయం కోసం పోరాటం కొనసాగుతుంది**
- **యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్.**

సింగరేణి మండల: కాంగ్రెస్ అగ్రనేత,లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్ తీవ్రంగా ఖండించారు బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా రాహుల్ గాంధీ గారిపై కేసు నమోదు చేయించిందని ఆయన ఆరోపించారు. ప్రజా సమస్యలు,రాజ్యాంగ పరిరక్షణ,సామాజిక న్యాయం,దళితుల ఆత్మగౌరవం వంటి అంశాలపై ప్రశ్నించినందుకు కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గారి సభ అనంతరం జరిగిన 'శుద్ధీకరణ'ఘటనపై ప్రశ్నించిన ప్రతిపక్ష నేత శ్రీ రాహుల్ గాంధీ గారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం సరైనదికాదని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్ పేర్కొన్నారు. మనుగడకు సంబంధించిన అన్ని అంశాలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ రాహుల్ గాంధీ గారు కేసులతో భయపెట్టాలని బీజేపీ ప్రభుత్వం భావిస్తే అది భ్రమేనని అన్నారు. కేసులు,ఎఫ్ఐఆర్‌లతో ప్రజల తరఫున ప్రశ్నించే గొంతును అణిచివేయలేరని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ గారి ఒక్కరిపై కేసు కాదు. ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నించిన ప్రతి గొంతుపై దాడి ఇది! బీజేపీ కక్షసాధింపు రాజకీయాలకు కాంగ్రెస్ భయపడదు బెదరదు వెనక్కి తగ్గదు! నిరుద్యోగం,ధరల పెరుగుదల,సామాజిక అసమానతలు, దళితులపై జరుగుతున్న అన్యాయాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ గారిపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.



## పి.డి.ఎస్. సన్న బియ్యం పంపిణీ గడువు పొడిగింపు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ)
మెదక్ జిల్లా రేషన్ కార్డు దారులకు తెలియజేయునది ఏమనగా, పి.డి.ఎస్. ద్వారా సన్న బియ్యం పంపిణీ గడువును 05.09.2026 వరకు పొడిగిస్తూ కమిషనర్, పౌర సరఫరాల శాఖ, తెలంగాణ, హైదరాబాద్ అవకాశం కల్పించారు.ఈ విషయాన్ని జిల్లా పౌర సరఫరాల అధికారి తెలియజేశారు. కావున ఇప్పటివరకు పి.డి.ఎస్. సన్న బియ్యం పొందని రేషన్ కార్డు దారులు ఈ అదనపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, సంబంధిత చౌక ధరల దుకాణం ద్వారా తమకు కేటాయించిన సన్న బియ్యాన్ని 05.09.2026లోపు పొందవలసిందిగా కోరడమైనది.అదేవిధంగా, జిల్లాలోని అన్ని చౌక ధరల దుకాణాల డీలర్లు నిర్ణీత సమయానికి దుకాణాలను తెరిచి ఉంచి,అర్హత కలిగిన రేషన్ కార్డు దారులందరికీ 100 శాతం పి.డి.ఎస్. సన్న బియ్యం పంపిణీ చేయాలి. బియ్యం పంపిణీలో నిర్లక్ష్యం వహించినా, దుకాణాలను నిర్ణీత సమయానికి తెరవకపోయినా లేదా లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయకుండా ఇబ్బందులకు గురిచేసినా,సంబంధిత డీలర్లపై నిబంధనల ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోబడతాయి.



## యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు. రాస్తారోకో

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ)
మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని పిఏసిఎస్ వద్ద మంగళవారం నాడు యూరియా లభించక రైతులు తీవ్ర ఆవేదన చెందారు. నిమిషాల్లో 2,000 బస్తాల యూరియా క్లోజ్ కావడం పై ఆవేశంతో రామాయంపేట - మెదక్ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. పంటలకు ఎరువులు అందక దిక్కుతోచని స్థితిలోకన్నీటిపర్యంతమయ్యారు.అధికారులు సమాచారం ఇచ్చేలోపే ఆన్‌లైన్ బుకింగ్ పూర్తవుతోందని మండిపడ్డారు. యూరియా నిల్వలు తమకు దక్కకుండా పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని ఇతర గ్రామాలతో పోలిస్తే తమపై తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారని ఆగ్రహించారు. అధికారుల తీరు వల్ల వ్యవసాయం చేయడం భారంగా మారిందని వాపోయారు. ఎంతోకాలంగా నిరీక్షిస్తున్నా తమకు ఒక్క బస్తా కూడా అందడం లేదని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం ఇలాగే ఉంటే తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన చెందారు. వెంటనే అధికారులు స్పందించి యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.లేకపోతే వ్యవసాయం వదులుకుని పురుగుల మందు తాగడానికైనా సిద్ధమని హెచ్చరించారు.గంటపాటు రాస్తారోకో చేయడంతో రహదారిపై వాహనాలు భారీగా నిలిచి, ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి, రైతులకు సముదాయించడం తో ఆందోళన విరమించారు.



జన సంఘర్షణ
బుధవారం
02 సెప్టెంబర్ 2026

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిస్థితిపై యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్ ఆగ్రహం...





కారేపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత కారణంగా పేద,సామాన్య రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యువజన కాంగ్రెస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడంతో,బయట మెడికల్ షాపుల్లో మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించే వారిలో ఎక్కువగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందినవారే ఉంటారని,వారికి ఉచితంగా అందాల్సిన మందులు ఆసుపత్రిలో లభించకపోతే అదనపు ఆర్థిక భారం పడుతుందని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్ అన్నారు. రోజువారీ కూలీలు,వృద్ధులు,మహిళలు,నిరుపేద కుటుంబాలకు చెందిన రోగులు మందుల కోసం బయటకు వెళ్లాల్సి రావడం మరింత ఇబ్బందికరంగా మారుతోందని తెలిపారు. మందుల కొరత కారణంగా వైద్యులు పరీక్షలు నిర్వహించినప్పటికీ,అవసరమైన మందులు అందించలేని పరిస్థితి ఏర్పడుతోందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం దెబ్బతినే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు,సిబ్బందిని ప్రశ్నించగా,జిల్లా కేంద్రం నుంచి అవసరమైన మందుల సరఫరా జరగడం లేదని సమాధానం ఇచ్చినట్లు యువజన కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మండల స్థాయిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అవసరమైన మందులు సకాలంలో చేరేలా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అత్యవసరంగా అవసరమైన మందుల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించి,కొరత ఏర్పడకముందే సరఫరా చేసే విధంగా పటిష్టమైన వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా పేద ప్రజలు తమ జేబు నుంచి డబ్బులు ఖర్చు చేసి మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితిని వెంటనే నివారించాలని అధికారులను కోరారు. మందుల కొరత సమస్యను తక్షణమే పరిష్కరించి,ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉంచి ప్రజలకు నాణ్యమైన,ఉచిత వైద్య సేవలు అందించాలని యువజన కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రాజేష్ నాయక్, మండల కార్యదర్శి సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ మున్సిపల్ కార్మికుల మహాధర్నా వేతనాల కోతలను వెంటనే ఆపాలి

- **బకాయి జీతాలు చెల్లించాలని కార్మికుల ర్యాలీ ధర్నా**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ)

మెదక్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య,ఇతర విభాగాల మున్సిపల్ కార్మికుల వేతనాల్లో అధికారులు అనవసరంగా కోతలు విధిస్తున్నారని ఆరోపిస్తూ సీఐటీయూ,మున్సిపల్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మెదక్ జిల్లా కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు.కార్మికులు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీగా తరలివచ్చి, అధికారుల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ప్రధాన డిమాండ్లు ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా విధిస్తున్న వేతన కోతలను నిలిపివేయాలి.గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను వెంటనే చెల్లించాలి.ప్రతి నెలా 1వ తేదీనే పూర్తి వేతనాలు చెల్లించాలి.పారిశుధ్య కార్మికులకు రక్షణ పరికరాలు, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ,పట్టణ ప్రజల పరిశుభ్రత కోసం తమ ఆరోగ్యాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న కార్మికుల వేతనాల్లో కోతలు విధించడంఅన్యాయమన్నారు. బయోమెట్రిక్ లేదా ఇతర కారణాలతో విధించిన కోతలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.వేతన కోతలను తిరిగి చెల్లించకపోతే భవిష్యత్తులో పారిశుధ్య పనులను నిలిపివేసి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ అధికారులకు అందజేశారు.




సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో కార్మికులు తాత్కాలికంగా ధర్నాను విరమించారు.

**మెదక్ మున్సిపల్ కార్మికుల మహాధర్నా**

వేతన కోతలు ఆపాలి. బకాయి జీతాలు చెల్లించాలి సీఐటీయూ,మున్సిపల్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మెదక్ కలెక్టరేట్ ముట్టడి, మహాధర్నా నిర్వహించిన మున్సిపల్ కార్మికులు.కార్మికుల డిమాండ్లు అకారణంగా విధిస్తున్న వేతన కోతలు నిలిపివేయాలి. పెండింగ్‌లో ఉన్న జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలి. ప్రతి నెల 1వ తేదీన పూర్తి జీతాలు ఇవ్వాలి. రక్షణ పరికరాలు, హెల్త్ కార్డులు అందించాలి. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి "న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదు!" వేతన కోతలను వెంటనే వెనక్కి తీసుకోకపోతే పారిశుధ్య పనులు నిలిపివేసి నిరవధిక సమ్మెకు దిగుతామని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు.

# పెన్షన్ హక్కుపై ఉద్యోగుల సమరభేరి.. నల్లబ్యాడ్జీలతో నిరసన!

- **పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి.. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి:**

కారేపల్లి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్




టీటీడబ్ల్యూయూఆర్‌జేసీ సింగరేణి ఉద్యోగులు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేస్తూ పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా టీటీడబ్ల్యూయూఆర్‌జేసీ, సింగరేణి ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగుల పెన్షన్ హక్కును దెబ్బతీసే కొత్త పెన్షన్ విధానం ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం ను వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేసిన ఉద్యోగులు.. పెన్షన్ హక్కు సాధించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఉద్యోగుల పదవీ విరమణ అనంతర జీవితానికి పెన్షన్ భద్రత ఎంతో అవసరమని, ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే స్పందించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొని తమ నిరసనను తెలియజేశారు. "పెన్షన్ హక్కు సాధించే వరకు పోరాటం ఆగదు.. ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలి!" అంటూ నినాదాలు చేశారు.

# తొనిగండ్ల లో ఉపాధి హామీ పనులపై ఒక సంవత్సరం ప్రణాళికపై గ్రామసభ నిర్వహించడం జరిగింది

- **గ్రామ సర్పంచ్ మల్లన్న గారి శివకుమారి నాగులు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా రామాయంపేట మండలం తొనిగండ్ల గ్రామంలో గ్రామ సర్పంచ్ మల్లన్న గారి శివకుమారి నాగులు ఆధ్వర్యంలో మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయం లో 2026బి28 సంవత్సరానికి గాను ఉపాధి హామీ పనుల నిమిత్తం గ్రామ ప్రజలతో కలిసి అధికారులు, పంచాయతీ వార్డు సభ్యులు గ్రామసభ నిర్వహించారు. ఏడాది పాటు జరిగే పనులను ప్రజలు ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీవో శంకర్, పంచాయతీ కార్యదర్శి మౌనిక, ఉప సర్పంచ్ దుర్గయ్య, బాలకృష్ణ, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ సిద్ధ రాములు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణ కేంద్రంలో నేడు బీజేపీ భారీ ధర్నా

- **భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి సాదుల అశోక్ ఆధ్వర్యంలో జరిగింది.**
- **22 ఏ నిషేధిత ప్రభుత్వ భూములను పేదలకు పెంచాలని డిమాండ్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ)




రైతుల సమస్యల పరిష్కారం కోసం 22 ఏ నిషేధిత భూముల జాబితా నుంచి రైతుల భూములను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ మెదక్ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించబడుతుంది. 02 సెప్టెంబర్ 2026 (బుధవారం),ఉదయం 10:00 గంటలకు ?వేదిక: బస్టాండ్ ఎదురుగా,నర్సాపూర్ పట్టణ కేంద్రం అధ్యక్షత వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ (మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షులు). ముఖ్య అతిథులు మాధవనేని రఘునందన్ రావు (మెదక్ పార్లమెంట్ సభ్యులు – ఎంపి బీజేపీ రాష్ట్ర స్థాయి ప్రముఖ నాయకులు.మెదక్ జిల్లాలోని బీజేపీ రాష్ట్ర,జిల్లా పదాధికారులు,సీనియర్ నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, వివిధ మోర్చాల బాధ్యులు, మండల-పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరుతున్నాము.

# ఎల్లమ్మ తల్లి సేవలో కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

- **పొడ్చాన్‌పల్లిలో ఘనంగా పంచమ వార్షికోత్సవం.**
- **ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్ష.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని పొడ్చాన్‌పల్లి గ్రామంలో శ్రీ రేణుక మాత (ఎల్లమ్మ తల్లి) దేవాలయ పంచమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి.తిరుపతిరెడ్డి హాజరయ్యారు. అమ్మవారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. పంచమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన గౌడ సంఘం నాయకులను అభినందించారు. అనంతరం గౌడ సంఘం నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి,ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాలగౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు గురుమూర్తి గౌడ్, శ్రీనాథ్‌రావు,మెదక్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి. మాణిక్యరెడ్డి, కొండల్ రెడ్డి, శ్రీనివాస్, పవిత్రదుర్గయ్య, రఘు.ప్రభుగౌడ్,పాపయ్య, వినయ్ దేవయ్య,దేవరెడ్డి, గోపాల్,లింగం, దుర్గయ్య, యేసులు,కృష్ణ, నరేష్, ప్రశాంత్, నవీన్,శివ,వెంకట్, ముజ్జు,ఇమ్రాన్,గౌడ సంఘ నాయకులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నోటీసు, విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలి



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ)

మంగళవారం పిల్లి కొట్టాల్లో 12 వార్డులో నిర్వహించిన ఎస్ ఐ ఆర్ నోటీసుల విచారణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ నోటీసు,విచారణ ప్రక్రియ లో భాగంగా ఆధారాలు పూర్తి స్థాయిలో తీసుకొని యాప్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. పిల్లికొట్టిల్ లో 124 నోటీసులకు 91 నోటీస్ లకు విచారణ పూర్తి చేసినట్లు వివరించారు. ఏలాంటి తప్పు ఒప్పులకు తావు లేకుండా పారదర్శకంగా ఎస్ ఐ ఆర్ నోటీసుల విచారణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, మెదక్ తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పంటల నమోదు పక్కాగా చేపట్టాలి

◆ **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ)



జిల్లాలో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పక్కాగా నమోదు చేయాలని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. మంగళవారం టేక్మాల్ మండలంలోని ఎల్లుపేట్ గ్రామంలో జరుగుతున్న పంటల నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పక్కాగా నమోదు చేయాలని, ప్రతి రైతు సాగు చేస్తున్న పంట, విస్తీర్ణం, సాగు విధానం తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పంటల నమోదును పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే మెదక్ జిల్లాలో 6.9 శాతం పంట నమోదు పూర్తయినట్లు వివరించారు. పంటల నమోదు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పంటల నమోదు ఆధారంగానే రైతులకు ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు, పంటల కొనుగోలు, తదితర ప్రయోజనాలు అందే అవకాశం ఉన్నందున నమోదు ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని పేర్కొన్నారు. రైతులు తమ పొలాల్లో సాగు చేసిన పంటల వివరాలను సంబంధిత వ్యవసాయ అధికారులకు తెలియజేసి, పంటల నమోదు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో పంటల నమోదును అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నమోదైన వివరాలు వాస్తవ సాగుకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే అంశాన్ని నిర్ధారించాలని సూచించారు. పంటల నమోదు ప్రక్రియను సెప్టెంబర్ 30 వరకు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, సమగ్ర వివరాలను సంబంధిత శాఖకు అందజేయాలని ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, స్థానిక తహసీల్దార్, తులసి రామ్ ,స్థానిక సర్పంచ్, నరసింహారెడ్డి,ఏ ఈ ఓ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ క్యాంటీన్‌కు అడుగులు

◆ **పోలీస్ అసోసియేషన్ విజ్ఞప్తిపై ఎస్పీ సానుకూల స్పందన.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ)



జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం దిశగా మెదక్ జిల్లాలో పోలీస్ క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఇటీవల ఎన్నికైన మెదక్ జిల్లా పోలీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు జిల్లా అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావును కలిసి మెదక్ జిల్లాలో పోలీస్ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు విజ్ఞప్తి చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారి విజ్ఞప్తిపై ఎస్పీ సానుకూలంగా స్పందించారు. క్యాంటీన్ ఏర్పాటు విషయమై ఉన్నతాధికారులతో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్యాంటీన్ ఏర్పాటు ప్రక్రియకు సంబంధించిన బాధ్యతలను సీఐ సందీప్‌రెడ్డి,ఆర్ఐ శైలేందర్‌కు అప్పగించారు. జిల్లా పోలీసు సిబ్బందికి అవసరమైన నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉండేలా క్యాంటీన్ ఏర్పాటు చేయడం ద్వారా మరింత సౌకర్యం కలగనుందని పోలీస్ అసోసియేషన్ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## నోటీసులు అందిన ఓటర్లు ఆందోళన చెందొద్దు

◆ **విచారణ తేదీన హాజరై సరైన ధ్రువపత్రాలు సమర్పించాలి: తహసీల్దార్ తారాబాయి!!!!**

రుద్రూర్, సెప్టెంబర్ 1 (జనసంఘర్షణ):



ఓటర్ల సవరణ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని రుద్రూర్ తహసీల్దార్ తారాబాయి స్పష్టం చేశారు. మంగళవారం రుద్రూర్ మండలంలోని రాయపూర్ క్యాంపు గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమకు కేటాయించిన విచారణ తేదీన గ్రామపంచాయతీ కార్యాలయానికి హాజరై, అధికారులు కోరిన సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా వివరాలను పారదర్శకంగా పరిశీలించేందుకే నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. విచారణకు హాజరయ్యే సమయంలో అవసరమైన ధ్రువపత్రాలను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని తహసీల్దార్ సూచించారు. పత్రాలను సమర్పించిన అనంతరం సంబంధిత ఓటర్ల వివరాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేందర్ నాయక్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అత్యాశ భయం. తొందరపాటు సైబర్ నేరగాళ్లకు ఆయుధాలు

◆ **ఒక్క క్లిక్‌తో జీవితాన్ని మార్చేస్తున్న సైబర్ మోసాలు.**
◆ **అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు చెక్.**
◆ **జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ)

చేతిలో సెల్‌ఫోన్ ఉంటే చాలు ప్రపంచమే అరచేతిలోకి వచ్చినట్టే. బ్యాంకింగ్ నుంచి షాపింగ్ వరకు నగదు బదిలీల నుంచి ప్రభుత్వ సేవల వరకు అన్నీ క్షణాల్లో జరిగిపోతున్నాయి. అయితే, ఇదే ఆధునిక సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఒక్క ఫోన్‌కాల్ ఒక్క లింక్.. ఒక్క ఓటీపీ, జీవితాంతం కష్టపడి సంపాదించిన సొమ్మును క్షణాల్లో ఖాళీ చేసే పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రజలు కాస్త అప్రమత్తంగా వ్యవహరిస్తేనే సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ సూచించారు. సైబర్ నేరగాళ్ల ప్రధాన లక్ష్యం మన నమ్మకం, భయం, అత్యాశ, తొందరపాటు అని ఎస్పీ తెలిపారు. బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేసి ఖాతా బ్లాక్ అవుతుందని భయపెట్టడం. పోలీసులమంటూ కేసు నమోదైందని బెదిరించడం.. ఉద్యోగం,లోన్,లాటరీ,భారీ బహుమతుల పేరుతో ఆశ చూపించడం వంటి కొత్తకొత్త పద్ధతులతో ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. కొన్నిసార్లు తెలిసిన వ్యక్తుల ఫొటోలు, పేర్లను సోషల్ మీడియాలో ఉపయోగించి అత్యవసరంగా డబ్బులు పంపాలని కోరుతున్నారని తెలిపారు. భయంతోనో అత్యాశతోనోతొందరపాటుతోనో స్పందించిన క్షణమే మోసగాళ్లకు అవకాశం దొరుకుతుందని హెచ్చరించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీ, యూపీఐ పిన్, పాస్‌వర్డ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని ఎస్పీ స్పష్టం చేశారు. బ్యాంకులు, పోలీసు శాఖ లేదా ప్రభుత్వ సంస్థలు ఫోన్‌లో ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్‌లు అడగవని గుర్తుంచుకోవాలన్నారు. గుర్తుతెలియని లింకులపై క్లిక్ చేయడం, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం, ఇతరులకు మొబైల్ స్క్రీన్‌ను షేర్ చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన తర్వాత భయంతో మౌనంగా ఉండొద్దని ఎస్పీ అన్నారు. డబ్బు పోయిన వెంటనే 1930కు కాల్ చేయాలని, ఆలస్యం చేయకుండా వెంటనే ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. సకాలంలో సమాచారం అందిస్తే మోసపోయిన నగదు తదుపరి ఖాతాలకు బదిలీ కాకుండా నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి నిమిషం ఆలస్యం కూడా బాధితుడి నష్టాన్ని పెంచే అవకాశం ఉందన్నారు. సైబర్ నేరాల నుంచి రక్షణ పోలీసుల బాధ్యత మాత్రమే కాదని.. ప్రతి కుటుంబం, ప్రతి మొబైల్ వినియోగదారుడు అప్రమత్తంగా ఉండాలని



ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సాంకేతికత మన జీవితాన్ని సులభతరం చేయాలి.. సైబర్ నేరగాళ్లకు అవకాశం ఇవ్వకూడదు. క్లిక్ చేసే ముందు ఆలోచించండి.. వివరాలు చెప్పే ముందు ఒక్కసారి ఆగండి.. అనుమానం వస్తే వెంటనే అప్రమత్తం అవండి.. అవసరమైతే పోలీసులను సంప్రదించండి. ప్రజల అప్రమత్తతే సైబర్ నేరగాళ్లకు అసలైన అడ్డుకట్ట అని ఎస్పీ పేర్కొన్నారు.

## పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఎంబెల్లి శంకర్!

◆ **ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..**
◆ **సంఘాన్ని మరింత బలోపేతం చేస్తా**



బోధన్, సెప్టెంబర్ 1 (జనసంఘర్షణ):
పీఆర్టీయూ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఎంబెల్లి శంకర్ ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్ష పదవికి నిర్వహించిన ఎన్నికల్లో ఆయన తన సమీప ప్రత్యర్థిపై విజయం సాధించి అధ్యక్ష బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎంబెల్లి శంకర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్న ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం కోసం సంఘం తరఫున బలమైన పోరాటం చేస్తానని పేర్కొన్నారు. అలాగే పీఆర్టీయూను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, ఉపాధ్యాయులందరినీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఎంబెల్లి శంకర్ తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## ఇండియన్ కార్పొరేషన్ లిమిటెడ్ 67 సంవత్సరాలుగా ప్రజలకు నిరంతర సేవలు అందిస్తున్నాం

◆ **దంతేపల్లి గ్రామ సర్పంచ్ మస్కూరి బాలరాజు.**
◆ **రామాయంపేట పట్టణంలోని శైలజ ఫైలింగ్ స్టేషన్ డీలర్ బాలరాజు తెలిపారు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ)



సెప్టెంబరు1 ఇండియన్ కార్పొరేషన్ లిమిటెడ్ 67 సంవత్సరాలుగా ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్నామని దంతేపల్లి సర్పంచ్ బాలరాజు, శైలజ ఫైలింగ్ స్టేషన్ డీలర్ బాలరాజు అన్నారు. ఈ సందర్భంగా అనాధ ఆశ్రమంలో మతిస్థిమితం లేని వారికి భోజనము వాళ్ళ మధ్యలో ఈ కార్యక్రమం జరుపుకోవడం జరిగింది దీనికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆఫీసర్ అన్వేషర్ తెలంగాణ అన్యంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ అమరేందర్ రెడ్డి, ఐటిసి స్టేట్ ప్రెసిడెంట్ చర్యల సురేష్, మెదక్ జిల్లా ప్రెసిడెంట్ మస్కూరి బాల్ రాజు, హయాజ్, ప్రశాంత్,శ్రీనివాస్, అశోక్ రెడ్డి,శ్రవణ్ కుమార్, అశోక్ గౌడ్,విద్యాసాగర్, తదితరులు పాల్గొనడం జరిగింది.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి!

◆ **వెయ్యి రోజుల ప్రజా పాలనలో అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట!**
◆ **ూ×ఖఔజ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొడాలి సురేష్!**

పోర్చుగల్/ సెప్టెంబర్ 1 (జనసంఘర్షణ):
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజుల ప్రజా పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని ూ×ఖఔజ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొడాలి సురేష్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

**రైతు సంక్షేమానికి పెద్దపీట!**

రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు రూ.500 బోనస్, పంటలకు గిట్టుబాటు ధర, 24 గంటల ఉచిత వ్యవసాయ విద్యుత్ వంటి చర్యలతో ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలుస్తోందన్నారు. రైతు కుటుంబాలపై అప్పుల భారాన్ని తగ్గించి వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చే దిశగా చర్యలు చేపడుతోందని తెలిపారు.

**మహిళలకు ఆర్థిక భరోసా!**

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలపై నెలవారీ ఖర్చుల భారాన్ని తగ్గించారని పేర్కొన్నారు.

**పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం!**

సొంత ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం వంటి నిర్ణయాలు పేదలకు భరోసా కల్పిస్తున్నాయని కొడాలి సురేష్ అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

**విద్య, ఉపాధికి ప్రాధాన్యం!**

ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తూ మౌలిక వసతులు, ఫర్నిచర్, నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎన్నో ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసి వేలాది మందికి ఉద్యోగాలు కల్పించడం అభినందనీయమన్నారు. నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఉపాధి అవకాశాలను పెంచుతున్నారని చెప్పారు.

**గ్రామీణాభివృద్ధి.. సామాజిక న్యాయం!**

గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు కులగణన, ఎస్సీ వర్గీకరణ వంటి కీలక నిర్ణయాలు



తీసుకోవడం సామాజిక న్యాయం దిశగా ముందడుగు అని పేర్కొన్నారు. రైతుకు భరోసా!.. మహిళకు గౌరవం.. యువతకు ఉద్యోగం.. పేదలకు ఇల్లు.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని కొడాలి సురేష్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం హామీలు ఇచ్చే ప్రభుత్వం కాదని, ఇచ్చిన మాటను అమలు చేసే ప్రజా ప్రభుత్వమని వెయ్యి రోజుల పాలన నిరూపించిందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణను మరింత అభివృద్ధి చెందిన, బలమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

## షాపింగ్ మాల్స్‌లో ఐసీసీ కమిటీలు!



◆ **మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు!**

నసురుల్లాబాద్/బాన్సువాడ, సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ):
పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపులకు అడ్డుకట్ట వేయడంతో పాటు, వారికి సురక్షితమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో బాన్సువాడలోని షాపింగ్ మాల్స్‌లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు (ఐసీసీ) ఏర్పాటు చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని మహిళా సాధికారిక కేంద్రం ప్రతినిధి తులసి మాట్లాడుతూ మహిళలు ఎలాంటి వేధింపులు, అనుచిత ప్రవర్తన ఎదురైనా భయపడకుండా ఐసీసీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సీడీపీఓ సంధ్య, కార్మిక శాఖ అధికారి దావూద్ మార్గదర్శకత్వంలో కార్యక్రమం నిర్వహించారు. మహిళల గౌరవం, హక్కులు, భద్రత విషయంలో యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరించాలని, ఉద్యోగినులకు సురక్షితమైన పని వాతావరణం కల్పించాలని అధికారులు సూచించారు.

జన సంఘర్షణ
బుధవారం 02 సెప్టెంబర్ 2026

# మంజీర పరివాహక ప్రాంతంలో అక్రమ ఇసుక రవాణా?

- **ఆర్ఐకి పట్టుబడ్డ ఇసుక ట్రాలీ.. అక్రమ రవాణాపై అధికారుల హెచ్చరికలు ఎక్కడ?**
- **రాత్రివేళల్లో డోజర్లు, టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలింపు జరుగుతోందంటున్న స్థానికులు**

సాలూర/, సెప్టెంబర్ 1/ (జనసంఘర్షణ):

మంజీర పరివాహక ప్రాంతంలో అక్రమ ఇసుక రవాణాపై మరోసారి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాలూర మండలంలోని మందర్నా, తగ్గేలి ప్రాంతాల నుంచి కొంతకాలంగా రాత్రివేళల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఇసుక తరలిస్తున్న ఓ ట్రాలీ ఆటోను సాలూర మండల ఆర్ఐ శంకర్ పట్టుకున్నట్లు సమాచారం. సాలూర క్యాంపు మార్గమధ్యలో ఇసుకతో వెళ్తున్న ట్రాలీ ఆటోను గుర్తించిన ఆర్ఐ దానిని అదుపులోకి తీసుకుని అనంతరం బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది.

**రాత్రివేళల్లో యథేచ్ఛగా తరలింపు?**

మంజీర పరివాహక ప్రాంతంలోని తగ్గేలి నుంచి రాత్రి వేళల్లో డోజర్లతో ఇసుకను తవ్వి టిప్పర్లు, బొలెరోలు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయడం లేదనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. అధికారుల హెచ్చరికలు.. చర్యలు తప్పవు!!!!

ప్రభుత్వ అనుమతులు లేకుండా మంజీర పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను తవ్వడం, తరలించడం చట్టవిరుద్ధమని అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, రాత్రివేళల్లో ఇసుక తరలింపుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై వాహనాల సీజ్‌తో పాటు చట్టపరమైన చర్యలు



తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా కొనసాగితే ఉపేక్షించేది లేదని అధికారులు కఠిన హెచ్చరికలు జారీ చేసి, ఆ హెచ్చరికలను ఆచరణలోనూ చూపించాలని స్థానికులు కోరుతున్నారు.

# శిరీషపై హత్యాచారాన్ని ఖండిస్తూ సీఐటీయూ ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్లమండలం, సెప్టెంబర్ 01(జనసంఘర్షణ):

శిరీషపై జరిగిన హత్యాచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో చర్ల మండలం కొయ్యూరు హాస్పిటల్ నుండి సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో సీఐటీయూ ఆశా వర్కర్లు, మహిళలు, ప్రజా సంఘాల నాయకులు ర్యాలీలో పాల్గొని శిరీషకు న్యాయం చేయాలని నినదించారు. ఈ సందర్భంగా చర్ల సీపీఎం మండల కార్యదర్శి మచ్చా రామారావు మాట్లాడుతూ.. శిరీషపై జరిగిన దారుణ ఘటన తీవ్రంగా కలచివేసిందని, నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు పూర్తి భద్రత కల్పించడంలో ప్రభుత్వం మరింత బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళల రక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఐద్వా మండల కార్యదర్శి పొదుపుగంటి సమ్మక్క మాట్లాడుతూ, మహిళలపై హింస, లైంగిక దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శిరీష కుటుంబానికి అండగా నిలవడంతో పాటు, న్యాయం జరిగే వరకు ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు. రైతు సంఘం మండల కార్యదర్శి నల్లగట్ల మూర్తి మాట్లాడుతూ.. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదని, నిందితులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలందరూ కలిసి మహిళలపై




హింసకు వ్యతిరేకంగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ సంఘీభావ ర్యాలీలో సీఐటీయూ నాయకురాలు ఆశా వర్కర్లు మడప సుజాత, పాయం చంద్రకళ, ఎర్రం ఉషారాణి, బొగ్గుల హైమావతి, ఇర్ప విజయరాణి తదితరులు పాల్గొన్నారు. ర్యాలీలో పాల్గొని,వారు శిరీషకు న్యాయం చేయాలని, మహిళలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు.

## తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు హౌస్ అరెస్ట్!

- **నల్లగొండ పర్యటనకు ముందే పోలీసుల ఆంక్షలు.. కాంగ్రెస్--బీజేపీ మధ్య పెరిగిన ఉద్రిక్తత!!!**

హైదరాబాద్/, సెప్టెంబర్ 1 /(జన సంఘర్షణ):




తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావును పోలీసులు మంగళవారం హౌస్ అరెస్ట్ చేసినట్లు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. నల్లగొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఇంటిపై సోమవారం కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఆయనను పరామర్శించేందుకు రామచంద్రరావు నల్లగొండ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆయన నల్లగొండ పర్యటనకు!!!! బయలుదేరే ముందు పోలీసులు ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. దీంతో రామచంద్రరావు పర్యటన నిలిచిపోయింది. ఈ ఘటనతో అధికార కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. పార్టీ నాయకుడిని పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను నిరోధించడమేనని బీజేపీ నేతలు విమర్శించారు. మరోవైపు, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే పోలీసులు ఆంక్షలు విధించినట్లు సమాచారం. నల్లగొండ ఘటన నేపథ్యంలో ఇరు పార్టీల మధ్య చోటుచేసుకున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# అర్ధరాత్రి దాటితే పెట్రోల్ కష్టాలు!!!

- **బంక్‌లో పెట్రోల్ అందుబాటులో లేదంటున్న వాహనదారులు.. సిబ్బంది తీరుపై ఆగ్రహం!!!**

బోధన్,/ సెప్టెంబర్ 1 /(జనసంఘర్షణ):




అర్ధరాత్రి దాటితే పెట్రోల్ కోసం వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని బోధన్ పట్టణ శివారులోని బాబా గార్డెన్ సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌పై ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి 12 గంటలు దాటిన తర్వాత పెట్రోల్ పోయడం లేదని పలువురు వాహనదారులు వాపోతున్నారు. సోమవారం రాత్రి పెట్రోల్ కోసం బంక్‌కు వెళ్లిన పలువురు వాహనదారులతో సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. పెట్రోల్ అందుబాటులో లేకపోవడంతో కొందరు తమ ద్విచక్ర వాహనాలను తోసుకుంటూ వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. పట్టణ శివారులో ఉన్న ఈ బంక్‌పై దూర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ఆధారపడుతున్న నేపథ్యంలో రాత్రివేళల్లోనూ పెట్రోల్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత యాజమాన్యం స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆదివాసి బిడ్డ శిరీష ను అతి దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి సంపూర్ణ న్యాయం అందించాలి...

- **పాలంపల్లి మాజీ సర్పంచ్ దారావత్ భద్రునాయక్**
- **శిరీష మృతి ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో, జ్యుడిషియల్ విచారణ జరపలి**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ములకలపల్లి మండలానికి చెందిన ఆదివాసి యువతి ఊకే శిరీషపై జరిగిన అత్యాచారం, అనంతరం జరిగిన హత్య రాష్ట్ర ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని భద్రునాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసి సమాజానికి చెందిన ఒక అమాయక యువతి ప్రాణాలు కోల్పోయిన తర్వాత కూడా, ఘటనకు సంబంధించిన పూర్తి నిజాలు వెలుగులోకి రాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. అందువల్ల ఈ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో, జ్యుడిషియల్ విచారణ జరిపి అసలు వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజన మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, వేధింపులు పెరుగుతుండటం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు ఉన్నప్పటికీ, దళిత, గిరిజన మహిళల ప్రాణాలు, గౌరవం, భద్రతకు పూర్తి స్థాయిలో రక్షణ లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత, గిరిజన బాధితులపై దాడులు జరిగినప్పుడు కేసులు నమోదు చేస్తున్నప్పటికీ, తరువాత వాటిని బలహీనపరిచే ప్రయత్నాలు, రాజకీయ ఒత్తిళ్లు, రాజీలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. నేరస్థులను కాపాడే ఏ రాజకీయ నాయకుడైనా, ప్రభావశీలుడైనా చట్టం ముందు నిలబడాల్సిందేనని స్పష్టం చేశారు. ఊకే శిరీషపై దారుణానికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేసి, వేగవంతమైన విచారణ జరిపి చట్టప్రకారం అత్యంత కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదు ఎకరాల సాగుభూమి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు.

## రుద్రూర్ మండల సమాఖ్యకు నూతన కార్యవర్గం!

- **మహాజనసభ ఏకగ్రీవ తీర్మానంతో పదాధికారుల ఎన్నిక!**

రుద్రూర్,/ సెప్టెంబర్ 1 /(జనసంఘర్షణ):



రుద్రూర్ మండల సమాఖ్య మహాజనసభ సమావేశం మండల కేంద్రంలోని సమీకృత భవనంలో మండల సమాఖ్య అధ్యక్షురాలి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి మండల సమాఖ్య పరిధిలోని అన్ని గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లు, కార్యదర్శులు హాజరయ్యారు. గతంలో మండల సమాఖ్య నిర్వహణకు ఎన్నికైన పదాధికారుల పదవీకాలం ముగియడంతో, నూతన పదాధికారులను మహాజనసభ ఏకగ్రీవ తీర్మానంతో ఎన్నుకున్నారు. మండల సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా సిద్ధాపూర్ గ్రామ సంఘానికి చెందిన బి. రాధా, కార్యదర్శిగా రుద్రూర్ హనుమాన్ గ్రామ సంఘానికి చెందిన గంగామణి, కోశాధికారిగా గజ్జలవ గ్రామ సంఘానికి చెందిన తబస్సుం బేగంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన పదాధికారులు మండల సమాఖ్య అభివృద్ధికి, గ్రామ సంఘాల బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలని మహాజనసభలో సభ్యులు ఆకాంక్షించారు. మహిళా సంఘాల సమస్యలను పరిష్కరించడంతో పాటు, సంఘాల ద్వారా మహిళలకు అందుతున్న కార్యక్రమాలు, అవకాశాలను మరింత విస్తరించేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య మాజీ అధ్యక్షురాలు ద్రుపతి, ఏపీఎం బస్వంత్ రావు, సీసీలు విఠల్, పూల్‌సింగ్, అకౌంటెంట్ సుద తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 420 హామీలపై బీఆర్ఎస్ పోరుబాట

- **నేటి నుండి 8వ తేదీ వరకు తెలంగాణలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తాం.**
- **బిఆర్ఎస్ పార్టీ స్పష్టం చేసింది.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ)





కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి1000 రోజులు గడుస్తున్నా హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని నిరసిస్తూ బీఆర్ఎస్ పోరుబాట కార్యక్రమాలు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తేదీ 02-09-2026 బుధవారం ఉదయం 10:00 గంటలకు మెదక్ హెడ్ పోస్ట్ ఆఫీస్ అంబేద్కర్ చౌరస్తా నుండి రాందాస్ చౌరస్తా వరకు ర్యాలీ అనంతరం ధర్నా,బాకీ కార్డు పంపిణీ,కాంగ్రెస్ 420 హామీల ఫ్లెక్సీ ప్రదర్శన నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి మాజీ చైర్మన్ లు,బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు,సర్పంచ్ లు, పట్టణ మండల పార్టీ, అధ్యక్షులు,వార్డు ఇన్చార్జిలు, మాజీ జెడ్పిటిసిలు,ఎంపీపీలు, మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీలు,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మనవి చేశారు.

## భూ రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో అభ్యంతరాల కోసం అప్పీల్ చేసుకోవాలి

- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లాలో భూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో అభ్యంతరాల కోసం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఆపిల్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం మెదక్ తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలో భూ సర్వే పూర్తయిన ఆరు గ్రామాల్లో భూ సమస్యలపై అభ్యంతరాలు ఉంటే 9(2) యాక్ట్ ద్వారా అప్పీల్ చేసుకుంటే తహసిల్దార్ కార్యాలయంలో డి టి లెవల్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ అధికారుల ద్వారా సమస్యలకు పరిష్కారం అవుతుందని అన్నారు. తహసిల్దార్ కార్యాలయంలో రిసర్వే అప్పీల్ కోసం కౌంటర్లను ఏర్పాటు చేయని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, ఏడి ల్యాండ్ సర్వే కిషన్,తాహసిల్దార్ లక్ష్మణ్ బాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వాగత తోరణ నిర్మాణానికి బ్రేక్!

- **అనుమతులపై వివాదం.. నిర్మాణం నిలిపివేయాలని హైకోర్టు ఆదేశాలు**
- **అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవా?**



వర్ని, /సెప్టెంబర్ 1 /(జనసంఘర్షణ):
వర్ని మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వద్ద నిర్మిస్తున్న బడా పహాడ్ స్వాగత తోరణ నిర్మాణానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన అనుమతులు తీసుకోకుండానే నిర్మాణ పనులు చేపట్టారంటూ కొందరు స్థానికులు హైకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై హైకోర్టు నిర్మాణ పనులను నిలిపివేయాలని జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో ప్రస్తుతం స్వాగత తోరణ నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

**అధికారులపై ప్రజల ప్రశ్నలు!**

ప్రధాన రహదారి వద్ద నిర్మాణ పనులు చేపట్టే సమయంలో సంబంధిత శాఖల అనుమతులు, రహదారి భద్రత తదితర అంశాలను ముందుగానే పరిశీలించాల్సిన బాధ్యత అధికారులదేనని స్థానికులు పేర్కొంటున్నారు. అనుమతులపై స్పష్టత లేకుండానే పనులు ప్రారంభమైతే అధికారులు ముందుగానే ఎందుకు స్పందించలేదని ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.. అనుమతులు ఉంటే వాటిని బహిరంగంగా వెల్లడించి ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలి అని స్థానికులు కోరుతున్నారు. హైకోర్టు ఆదేశాలను అధికారులు కచ్చితంగా అమలు చేయాలని, పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, నిబంధనలపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని అధికారులు స్పష్టమైన హెచ్చరిక జారీ చేయడంతో పాటు, ఆ హెచ్చరికలు కేవలం మాటలకే పరిమితం కాకుండా కఠిన చర్యల రూపంలో కనిపించాలని ప్రజలు కోరుతున్నారు.

# శిరీష హత్యను ఖండిస్తూ దీక్షకు సంఘీభావం





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, సెప్టెంబర్ 01(జనసంఘర్షణ):
హైదరాబాద్ తుక్కుగూడలో నర్సు ఊకె శిరీషపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనను తీవ్రంగా ఖండిస్తూ గొండ్వా వాసులు చేపట్టిన దీక్షకు చర్లలో సీపీఎం, సీఐటీయూ, శ్రీ గణేష్ ఆటో యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు. చర్ల బస్టాండ్ ముందు జరిగిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మచ్చా రామారావు మాట్లాడుతూ, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలకు వ్యతిరేకంగా సమాజం మొత్తం స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. కులాలు, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు వచ్చి మహిళల భద్రత కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రధాన డిమాండ్లు, శిరీష ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి. నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి. బాధిత కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించాలి. మహిళల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలి. మహిళలపై హింసకు వ్యతిరేకంగా కుల, మతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా నిలవాలి. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, శ్రీ గణేష్ ఆటో యూనియన్ అధ్యక్షులు పామరు బాలాజీ, సెక్రెటరి కోడిరెక్కల నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ బాలరాజుల సత్తిరాజు, చల్ల సతీష్, వేణు, తులసి మణికంఠ, వెంకటరావు సీఐటీయూ శ్రీ గణేష్ ఆటో యూనియన్ మండల కమిటీ నాయకులు యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు.

## 1000 రోజుల ప్రజా పాలనలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, సెప్టెంబర్ 01(జనసంఘర్షణ):
చర్ల, టీపీసీసీ, డీసీసీ భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు ఆదేశాల మేరకు, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల ప్రజా పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుంటున్న సందర్భంగా చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ నాయుడు ఆధ్వర్యంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్ , జిల్లా ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళి కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు "1000 రోజులు ప్రజా పాలనలో మార్పు" అనే అంశంపై మాట్లాడుతూ, 2023 డిసెంబర్‌లో ఏర్పడిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి, యువతకు అవకాశాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లంకరాజు,కొసరాజా రాజ, పిలక వేంకటరమణ రెడ్డి, నూపా కృష్ణ, పాలం నవీన్, మేడబట్టిన వాసు, చీమకుర్తి సాయి చరణ్, చింతూరి రజనీకాంత్, గంగ రాజు, సీత రాములు, మురళీధర్ నాయుడు, మహిళా కాంగ్రెస్ కట్టా అమ్మాజీ, స్వరూప, గిరిజా, సరోజినీ, వరలక్ష్మి అనుబంధ సంఘ నాయకులు పాలుగోన్నారు. ప్రజల జీవితాల్లో కనిపిస్తున్న మార్పు మహిళలకు అండగా మహాలక్ష్మి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అర్హులకు రూపాయలు 500 కే గ్యాస్ సిలిండర్ వంటి కార్యక్రమాలతో మహిళలపై ఆర్థిక భారాన్ని తగ్గించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రతి ఇంటికీ వెలుగు గృహజ్యోతి అర్హత కలిగిన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ జీరో బిల్లుల ద్వారా విద్యుత్ ఖర్చు భారాన్ని తగ్గిస్తోంది. పేదింటి సొంతింటి కల ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. రైతన్నకు భరోసా రైతు భరోసా రైతు సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ రైతు భరోసా, పంటలకు బోనస్ తదితర కార్యక్రమాల ద్వారా రైతు కుటుంబాలకు అండగా నిలుస్తోంది. ఆరోగ్యమే మహాభాగ్యం చేయూత రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిలో అర్హులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. యువతకు అవకాశాలు ఉద్యోగాల వైపు అడుగులు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, నియామక ప్రక్రియలను వేగవంతం చేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. 1000 రోజులు ఒక లెక్క కాదు, మార్పుకు ఒక గుర్తు. 1000 రోజుల ప్రజా పాలన అంటే కేవలం రోజుల లెక్క కాదు. ఒక కుటుంబానికి వచ్చిన వెలుగు, ఒక మహిళకు లభించిన ప్రయాణ స్వేచ్ఛ, ఒక రైతుకు అందిన భరోసా, ఒక పేద కుటుంబానికి కనిపించిన సొంతింటి కల, ఒక విద్యార్థికి కనిపించిన భవిష్యత్తు, ఒక నిరుపేదకు అందిన వైద్య సహాయం. ప్రతి పథకం వెనుక ఒక కుటుంబం. ప్రతి నిర్ణయం వెనుక ఒక భవిష్యత్తు. ప్రతి అడుగు వెనుక తెలంగాణ అభివృద్ధి లక్ష్యం, 1000 రోజులు, 1000 అడుగులు, ఒకే లక్ష్యం. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లక్ష్యం. ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి అవకాశాలు మాట ఇచ్చాం నిలబడ్డాం. ప్రజల ప్రభుత్వం ప్రజల కోసం ప్రభుత్వం, ప్రజల ఆశయాలను ముందుకు తీసుకెళ్లే ప్రభుత్వం. ప్రజల నమ్మకమే మా బలం, ప్రజల సంక్షేమమే మా లక్ష్యం, తెలంగాణ భవిష్యత్తే మా బాధ్యత, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల ప్రజా పాలనకు హృదయపూర్వక శుభాకాంక్షలు! ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో సంక్షేమం--అభివృద్ధి సమన్వయంతో తెలంగాణ మరింత ప్రగతి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాము.

## సదాశివనగర్ సీఐగా వీరయ్య బాధ్యతల స్వీకరణ

- **మర్యాదపూర్వకంగా కలిసిన భూంపల్లి మాజీ ఉపసర్పంచ్ పసుల సాయిలు**

కామారెడ్డి,/ సెప్టెంబర్ 1/ (జన సంఘర్షణ):



కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల నూతన సీఐగా వీరయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా భూంపల్లి గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నిజామాబాద్ కమిషనరేట్ పోలీస్ కంట్రోల్‌లో సీఐగా సేవలందించిన వీరయ్య బదిలీపై సదాశివనగర్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా భూంపల్లి మాజీ ఉపసర్పంచ్ పసుల సాయిలుతో పాటు గద్దల రవి, కాజాపురం సాయిలు, తాడ్వాయి భాస్కర్, కొండి నవీన్ తదితరులు సీఐ వీరయ్యను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. సదాశివనగర్ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని వారు ఆకాంక్షించారు.

## ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల అభివృద్ధి ప్రణాళిక పై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం

- **సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు**





ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజుల ప్రణాళికలో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశా. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాం. ఎన్నికలలో ఇచ్చిన గ్యారంటీ పథకాలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బిఆర్ఎస్ పార్టీ విమర్శలు చేస్తుంది. బిఆర్ఎస్ పార్టీ ఉనికిని కాపాడుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పై ఆందోళనలు చేయటానికి సిద్ధమైంది కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల పై పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలకు వివరించాలి.

## మహాధర్నాకు కదిలిన నసురుల్లాబాద్ ఉపాధ్యాయులు!

- **పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి.. పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి!**



నసురుల్లాబాద్/, సెప్టెంబర్ 1 /(జనసంఘర్షణ):
ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ పీఆర్టీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మహాధర్నాకు నసురుల్లాబాద్ మండల ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు జి. హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శి శ్రీచంద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు హైదరాబాద్‌కు పయనమయ్యారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, వెంటనే వేతన సవరణ సంఘాన్ని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలను విడుదల చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ముఖ్యంగా 2003 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరారు.

**హక్కుల సాధనకు ఉద్యమబాట!**

ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో మరింత జాప్యం చేస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడుతామని స్పష్టం చేశారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
బుధవారం
02 సెప్టెంబర్ 2026

# నసురుల్లాబాద్‌లో 391 దరఖాస్తులు!

- చేయూత పింఛన్ల దరఖాస్తులకు సెప్టెంబర్ 15 వరకు గడువు పొడిగింపు

నసురుల్లాబాద్,/ సెప్టెంబర్ 1 /(జనసంఘర్షణ):




చేయూత పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే గడువును రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 15 వరకు పొడిగించినట్లు నసురుల్లాబాద్ ఎంపీడీవో కే. రవీశ్వర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం మండల కేంద్రంతో పాటు 18 గ్రామపంచాయతీల పరిధిలో ఇప్పటివరకు 391 దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు. అర్హత ఉన్నప్పటికీ వివిధ కారణాలతో దరఖాస్తు చేసుకోని వారు గడువు పొడిగింపును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు. వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులు తదితర అర్హులు సెప్టెంబర్ 15లోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. అర్హులైన ఏ ఒక్కరూ అవకాశం కోల్పోకుండా సంబంధిత అధికారులు, సిబ్బంది సూచనలు పాటిస్తూ నిర్ణీత గడువులో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

# మమతా బెనర్జీ మేనకోడలు ఆత్మహత్య

- ఉపాధ్యాయ ఉద్యోగం కోల్పోవడంతో మానసిక ఒత్తిడి? కుటుంబ సభ్యుల వెల్లడి

పశ్చిమ బెంగాల్, సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ):



పశ్చిమ బెంగాల్‌లోని రాంపూర్‌హాట్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనకోడలు బ్రిష్టీ ముఖర్జీ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. పాఠశాల ఉపాధ్యాయ నియామకాలలో అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ కావడంతో సుమారు 26 వేల మంది ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది ఉద్యోగాలను కోల్పోయిన వారిలో బ్రిష్టీ ముఖర్జీ కూడా ఉన్నట్లు సమాచారం. ఉద్యోగం కోల్పోయిన అనంతరం ఆమె గత కొంతకాలంగా మానసిక ఒత్తిడి, వ్యక్తిగత సమస్యలతో బాధపడుతున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని రాంపూర్‌హాట్ వైద్య కళాశాలకు తరలించి తదుపరి ప్రక్రియ చేపట్టినట్లు తెలిసింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

# బాన్సువాడ కోటగల్లిలో ఇళ్లపై రాళ్ల దాడి

- వారం రోజులుగా వరుస ఘటనలు.. భయాందోళనలో కాలనీవాసులు!
- గుర్తుతెలియని వ్యక్తులపై అనుమానాలు.. విచారణ చేపట్టిన పోలీసులు!

బాన్సువాడ, సెప్టెంబర్ 1 (జనసంఘర్షణ):



కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని కోటగల్లి కాలనీలో గత వారం రోజులుగా రాత్రివేళల్లో ఇళ్లపై రాళ్లు పడుతున్న ఘటనలు కలకలం రేపుతున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు ఇళ్లపై రాళ్లు రువ్వుతున్నారనే ఆరోపణలతో కాలనీవాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వరుసగా ఇళ్లపై రాళ్లు పడుతుండటంతో ఎవరు.. ఎందుకు ఈ ఘటనలకు పాల్పడుతున్నారు? అనే ప్రశ్నలు స్థానికుల్లో చర్చనీయాంశంగా మారాయి. రాత్రి సమయాల్లో బయటకు రావాలన్నా కాలనీవాసులు జంకుతున్నట్లు తెలుస్తోంది. చిన్నారులు, వృద్ధులు ఉన్న కుటుంబాలు మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

**పోలీసుల విచారణ!**

ఇళ్లపై రాళ్లు పడుతున్న ఘటనలపై సమాచారం అందుకున్న పోలీసులు కోటగల్లిలో విచారణ చేపట్టారు. రాత్రివేళల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులపై నిఘా పెట్టడంతో పాటు, వరుస ఘటనలకు కారణమైన వారిని గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీలో భయాందోళన తొలగించేలా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ఘటనలకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు మెస్సీ వీడ్కోలు

- లియోనెల్ మెస్సీకి సీఎం రేవంత్‌రెడ్డి హృదయపూర్వక శుభాభినందనలు!!!!
- "ఆయన జీవితం.. ప్రయాణం భావితరాలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకం"!!!!!

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ):

అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించిన దిగ్గజ క్రీడాకారుడు లియోనెల్ మెస్సీకి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హృదయపూర్వక శుభాభినందనలు తెలిపారు. ఫుట్‌బాల్ ప్రపంచంలో మెస్సీ సాధించిన విజయాలు, నెలకొల్పిన రికార్డులు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. మెస్సీతో హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ మైదానంలో!!! కొంత సమయం గడపడం తనకు గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని సీఎం తెలిపారు. 2005లో అర్జెంటీనా జాతీయ జట్టు తరఫున అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అడుగుపెట్టిన మెస్సీ.. అసాధారణ ప్రతిభ, నిరంతర శ్రమ, పట్టుదలతో ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలో ప్రత్యేక ముద్ర వేశారని కొనియాడారు.

**క్రీడాస్ఫూర్తికి ప్రతీక!!!!**

ఒక ఆటగాడిగానే కాకుండా క్రీడాస్ఫూర్తికి ప్రతీకగా, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది యువతకు ఆదర్శంగా మెస్సీ నిలిచారని సీఎం అన్నారు. ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు, అరుదైన రికార్డులతో ఫుట్‌బాల్‌లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. మైదానానికే పరిమితం కాకుండా సమాజ సేవలోనూ మెస్సీ తన ప్రత్యేకతను చాటుకున్నారని తెలిపారు. చిన్నారుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి కోసం ఆయన చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు.




**తెలంగాణ క్రీడాభిమానులకు స్ఫూర్తి!!!**

భారత పర్యటనలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చి తెలంగాణ క్రీడాభిమానులను ప్రోత్సహించిన తీరు! చిరస్మరణీయమని సీఎం పేర్కొన్నారు. క్రీడలను ప్రోత్సహిస్తూ యువతను తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషికి మెస్సీ సందర్శన మరింత స్ఫూర్తినిచ్చిందన్నారు. క్రీడాస్ఫూర్తి!!!, పట్టుదల, ఏకాగ్రత, నిరంతర సాధన, వినయం, అంకితభావానికి మెస్సీ ప్రతిరూపమని సీఎం అన్నారు. ఫుట్‌బాల్ ఉన్నంతకాలం లియోనెల్ మెస్సీ పేరు, ఆయన ముద్ర, స్ఫూర్తి చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలుకుతున్న సందర్భంగా మెస్సీకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో ఆయన చేపట్టే సేవా కార్యక్రమాలు మరింత విజయవంతం కావాలని సీఎం ఆకాంక్షించారు.

# అడవి బాట నుంచి విశ్వవిద్యాలయంలో కోఆర్డినేటర్‌గా..!

- మావోయిస్టు పార్టీ మాజీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్‌కు కొత్త బాధ్యతలు!

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (జన సంఘర్షణ):

మావోయిస్టు పార్టీ మాజీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ (70) అలియాస్ భూపతి/సోనూకు మహారాష్ట్రలోని గడ్చిరోలి గోండ్వానా విశ్వవిద్యాలయంలో కొత్త బాధ్యతలు లభించాయి. విశ్వవిద్యాలయంలోని గ్రామసభల సామర్థ్య పెంపుదల, శిక్షణా కేంద్రంలో తాత్కాలిక ప్రాతిపదికన గ్రామసభల కోఆర్డినేటర్‌గా ఆయన ఎంపికయ్యారు.

గత ఆగస్టు 11న ఈ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల కాగా, పలువురు స్థానిక యువకులతో పాటు మల్లోజుల వేణుగోపాల్ కూడా దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను విశ్వవిద్యాలయం విడుదల చేసింది. అందులో తన పేరు ఉండటంతో మంగళవారం విశ్వవిద్యాలయానికి వెళ్లి జాయినింగ్ రిపోర్ట్ సమర్పించినట్లు సమాచారం.

**గ్రామసభలపై అవగాహన కల్పించే బాధ్యత!!!**

విశ్వవిద్యాలయం వివరాల ప్రకారం కోఆర్డినేటర్‌గా ఎంపికైన వారు గడ్చిరోలి జిల్లాలోని వివిధ గ్రామాలను సందర్శించి గ్రామసభల కార్యకలాపాలను పర్యవేక్షించడంతో పాటు, పెసా, అటవీ తదితర చట్టాల ద్వారా ఆదివాసులకు లభించిన హక్కులు, అధికారాలపై స్థానికులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

**నాలుగు దశాబ్దాల తర్వాత కొత్త జీవితం!!!!**

మల్లోజుల వేణుగోపాల్ నాలుగు దశాబ్దాలకు పైగా ఆదివాసుల మధ్యే తన జీవితాన్ని గడిపినట్లు సమాచారం. గత అక్టోబర్ 15న 60 మందికి పైగా సహచరులతో కలిసి జనజీవన స్రవంతిలోకి వచ్చిన ఆయన, ఇటీవల పునరావాస శిబిరం నుంచి విడుదలయ్యారు. ఇకపై కూడా ఆదివాసుల మధ్యే ఉంటూ వారి సమస్యలపై పనిచేస్తానని గతంలో ప్రకటించారు. ఈ నేపథ్యంలో అదే ప్రాంతంలోని గ్రామసభలతో అనుసంధానమై పనిచేసే బాధ్యతను తాత్కాలికంగానైనా చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. అడవుల్లో సాగిన నాలుగు దశాబ్దాల ప్రయాణం తర్వాత విశ్వవిద్యాలయ వేదికగా కొత్త బాధ్యతలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.



# ఎత్తొండ పీఏసీఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలి!

- నామినేటెడ్ అధ్యక్షుడిగా కొత్త సోమశేఖరరావును నియమించాలి!
- ఐదు గ్రామాల రైతుల ఏకగ్రీవ తీర్మానం.. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయం!!!!

కోటగిరి,/ సెప్టెంబర్ 1/ (జనసంఘర్షణ):

ఎత్తొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)కు పూర్వ వైభవం తీసుకురావాలనే లక్ష్యంతో సంఘం పరిధిలోని ఐదు గ్రామాల రైతులు, సభ్యులు పార్టీలకతీతంగా ఏకమయ్యారు. నామినేటెడ్ అధ్యక్షుడిగా గతంలో చైర్మన్‌గా పనిచేసిన కొత్త సోమశేఖరరావును మరోసారి నియమించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఎత్తొండ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎత్తొండ, ఎత్తొండ క్యాంప్, యాద్గార్‌పూర్, వల్బాపూర్, సిద్ధాపూర్ గ్రామాలకు చెందిన రైతులు, సంఘ సభ్యులు పాల్గొని సొసైటీ భవిష్యత్తు, అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు.

**సంఘాన్ని మళ్లీ అభివృద్ధి బాటలో నడిపించాలి!**

గతంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే మంచి పేరు సంపాదించిన ఎత్తొండ పీఏసీఎస్ ప్రస్తుతం అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘాన్ని తిరిగి బలోపేతం చేయాలంటే నిజాయితీ, నిబద్ధతతో పనిచేసే పాలకవర్గం అవసరమని అభిప్రాయపడ్డారు. గతంలో కొత్త సోమశేఖరరావు చైర్మన్‌గా ఉన్న సమయంలో సంఘం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారని రైతులు గుర్తుచేశారు. అందుకే ఆయన పేరును ఐదు గ్రామాల రైతుల తరఫున ఏకగ్రీవంగా ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ తీర్మానాన్ని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారు, స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.



**రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా: సోమశేఖరరావు!**

తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ప్రతిపాదించిన ఐదు గ్రామాల రైతులు, సంఘ సభ్యులకు రుణపడి ఉంటానని కొత్త సోమశేఖరరావు అన్నారు. రైతుల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ సంఘాన్ని తిరిగి అభివృద్ధి బాటలో నడిపించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సంఘంలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తానని, ధాన్యం కొనుగోళ్లు, తూకం విషయంలో ప్రతి రైతుకు సమాన న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎరువులు, విత్తనాలు సకాలంలో రైతులకు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. సంఘానికి సంబంధించిన రైస్‌మిల్లుపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి, దాని అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టి పీఏసీఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. "సంఘం మనది.. అభివృద్ధి బాధ్యత కూడా మనందరిదే. రైతులందరం ఐక్యంగా ముందుకు సాగితే ఎత్తొండ పీఏసీఎస్‌ను మళ్లీ ఆదర్శ సంఘంగా తీర్చిదిద్దుకోవచ్చు" అని ఆయన రైతులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎత్తొండ పీఏసీఎస్ సభ్యులు, ఎత్తొండ ఎత్తొండ క్యాంప్, యాద్గార్‌పూర్, వల్బాపూర్, సిద్ధాపూర్ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.




Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co